# తానా సేవలు భేష్

## ముగింపు సభలో మంత్రి సారథి



గుడివాడ కళాకారుల జడకోలాటం (ఇన్‌సెట్‌లో) కళ్లకు గంతలు కట్టుకుని విల్లు ఎక్కు పెడుతున్న లింగంగుంట్ల సుబ్బారావు

భవానీపురం, న్యూస్‌లైన్ : మనదేశ సంస్కృతి, సంప్రదాయం, ప్రాచీన కళలను పరిరక్షించాల్సిన బాధ్యతను తానా రాజకీయ నాయకులకు గుర్తుచేస్తోందని మంత్రి కె.పార్థసారథి అన్నారు. 'తానా చైతన్య స్రవంతి- తెలుగు వైభవం' పేరిట ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న మహోత్సవాల ముగింపు సభ శనివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సారథి మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి పట్ల ప్రవాసాంధ్రులు చూపిస్తున్న తీరు అభినందించదగిందన్నారు. కళలు అంటే గుర్తుకొచ్చే ఎన్‌టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్‌వీ రంగారావు జిల్లావాసులు కావడం అదృష్టమన్నారు. మునిసిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ సాంస్కృతిక విప్లవం రావాలనుకుంటున్న తరుణంలో తానా జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ముదావహమన్నారు. ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వారసత్వ సంపద అయినా తెలుగు భాష, జాతి, కళల గురించి ఖండాంతరంలో ఉండి కూడా తానా కృషి చేయడం అభినందనీయమన్నారు.

ఎంపీ రాయపాటి సాంబశివరావు మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతో తెలుగు ఉట్టిపడే కార్యక్రమాలను నిర్వహించిన తానా కృషి మరువలేనిదన్నారు. తానా అధ్యక్షుడు జయరామ్ మాట్లాడుతూ రెండురోజులపాటు నిర్వహించిన కార్యక్రమాలకు వచ్చిన స్పందన ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎండీ వేమూరి రాధాకృష్ణ, తానా ప్రెసిడెంట్ ఎలక్ట్ ప్రసాద్ తోటకూర, ఇండియా కో-ఆర్డినేటర్ ప్రసాద్ గారపాటి, కల్చరల్ చైర్, ఇండియా విజయ ఆసూరి, ఆహ్వాన సంఘం చైర్మన్ ముత్తవరపు మురళీకృష్ణ, సమన్వయకర్త డీఎస్ కోటేశ్వరరావు, శ్రీనివాస్ గోగినేని, గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, తానా కార్యదర్శి నన్నపనేని మోహన్, యడ్ల హేమాప్రసాద్, హరీష్ కోయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాకినేని రామారావు, మాంటిస్సోరి కళాశాల అధినేత వి.కోటేశ్వరమ్మ, ఎస్‌కేసీవీ ట్రస్ట్ నిర్వాహకురాలు భక్తి మణిహార, మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య, విద్యావేత్త కె.బసవపున్నయ్య, తెలుగు భాషా పండితులు మోపిదేవి భాస్కరరావును సత్కరించారు. ఉదయం నుంచి పలు జానపద కళలను, నాటికలను ప్రదర్శించారు. సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన తప్పెటగుళ్ల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.



అర్ధనారీశ్వరుడు



సన్మాన గ్రహీతలతో తానా ప్రతినిధులు



మాట్లాడుతున్న సారథి, పక్కన మునిసిపల్ కమిషనర్ రవిబాబు



వేదికపై సంక్రాంతి శోభ